క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో 12 కుటుంబాలు చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కొలిమిపల్లి గ్రామస్తులు

గోరంట్ల: వానవోలు పంచాయితీ పరిధిలోని కొలిమిపల్లిలో 12 కుటుంబాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణ సమక్షంలో శనివారం పార్టీ తీర్థంపుచ్చుకున్నాయి. సర్పంచ్ శ్రీరాములు, సహకార సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ బాబు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంకరనారాయణ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భాస్కరరెడ్డి, నీలే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పెనుకొండ రూరల్: మరువపల్లిలో శనివారం జరిగిన మైలార లింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

గోరంట్ల/ చిలమత్తూరు: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వందశాతం పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలని సీడీపీఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. శనివారం పాలసముద్రం, కోడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. అదేవిధంగా యాప్‌లో పిల్లల హాజరును ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. పౌష్టికాహారం అందించడంలో అక్రమాలకు పాల్పడితే సంబంధిత టీచర్‌పై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

సోమందేపల్లి: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థినులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎస్‌ఐ విజయ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా వివక్ష, ఈవ్ టీజింగ్, లైగింక వేధింపులకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫోక్సో, దిశా చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మురళి, ఎస్‌ఓ అనీత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

రొద్దం: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని డీవైఈఓ రంగస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. విద్యార్థులతో పాటు భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. భోజన నాణ్యతలో రాజీపడకూడదన్నారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు పనితీరుపై ఆరాతీశారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజారెడ్డి ఉన్నారు.

జొన్న విత్తనాల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని పశువైద్య ఆరోగ్య కేంద్రంలో రైతులకు సబ్సిడీతో గడ్డి కోసం జొన్న విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. డివిజన్‌లోని 12 మండలాలకు ఇప్పటికే 60 మెట్రిక్ టన్నుల జొన్నవిత్తనాలను ప్రభుత్వం అందించింది. మరో 40 మెట్రిక్ టన్నుల జొన్నగడ్డి విత్తనాలను సిద్ధంగా ఉంచారు. రైతులు కేవలం రూ.115 రూపాయలు చెల్లిస్తే ఎకరాకు సరిపడా జొన్న గడ్డి విత్తనం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ సమస్యలపై సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకూ డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలో ఏవైనా సమస్యలున్నవారు, సలహాలు, సూచనలు అందించాల్సిన వారు 9959225858కు నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లేపాక్షి: స్థానిక ఆర్టీసీ బస్టాండును హిందూపురం డీఎం శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. బస్సుల రాకపోకలపై ఆరా తీశారు.

చెరువు కట్ట విస్తరణకు చర్యలు

గోరంట్ల: పట్టణ సమీపంలోని రావికుంట చెరువు కట్ట విస్తరణకు చర్యలు తీసుకున్నారు. కట్టపై డబుల్‌లైన్ తారురోడ్డు వేయడంతో ప్రమాదాలకు చెక్ పెట్టినట్లయ్యిందని గ్రామస్తులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గోరంట్ల పట్టణం నుంచి రావికుంట చెరువు కట్ట మీదుగా శింగిరెడ్డిపల్లి, గొల్లపల్లి, గంగాదేవపల్లి, కాగానిపల్లి, చిన్నరప్పల్లి తదితర గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. అదేవిధంగా గోరంట్ల మండలానికి పొరుగు మండలమైన చిలమత్తూరు మండలంలోని చాగలేరు, కొడికొండ తదితర గ్రామాలకు ఇదే రోడ్డుమీదుగా వెళ్లాలి. అయితే రావికుంట చెరువుకట్టపై రోడ్డు ఇరుకుగా ఉండడంతోపాటు వంకర్లు ఉండడంతో ప్రమాదాలుచోటుచేసుకునేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత చిలమత్తూరు మండలం సోమగట్ట నుంచి గోరంట్ల పట్టణం వరకు డబుల్ తారురోడ్డు వేయడంతోపాటు రావికుంట చెరువుకట్ట విస్తరణకు చర్యలు తీసుకున్నారు. రోడ్లు భవనాల శాఖ రూ. 238 కోట్లు విడదల చేసింది. దీంతో చెరువుకట్ట వెడల్పుతో పాటు డబుల్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో చెరువుకట్టపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలకు చెక్కుపెట్టినట్లయ్యింది.



రావికుంట చెరువుకట్టపై డబుల్ లైన్ రోడ్డు వేసిన దృశ్యం

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రొద్దం: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్‌ఐ నాగస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అంశాలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. విద్యార్థులకున్న పలు చట్టాలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదివితే సమాజంలో విలువ ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే బహుమతులు అందిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు జాబిలి చాంద్‌బాషా, ఆంజనేయులు, శివయ్య, రామాంజనేయులు, ఆదినారాయణ, నారాయణస్వామి, పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



కోగిరలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగస్వామి

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో పోలీసులు విద్యార్థులకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. చట్టాలు,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అశ్లీల వీడియోలు, గుట్కా తదితర మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కియా ఎస్‌ఐ వెంకటరమణ, హెచ్ఎం గోవిందరావు, పీడీ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి

రొళ్ల: మార్చి 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు కృషి చేయాలని తహసీల్దార్ హసీనాసుల్తానా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలు, లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు 101 ప్రసాద వినియోగం ఒకేరోజు పెద్ద ఎత్తున జరగనున్న నేపథ్యంలో శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ముందస్తు చర్యగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరమణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, కమిటీ సభ్యులు, అర్చకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ హసీనాసుల్తానా

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

హిందూపురం: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పట్టణంలో సబ్‌డివిజన్ పోలీసులు పెద్ద ఎత్తున స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి ప్రధాన రహదారుల్లో కవాతు చేశారు. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో స్థానిక సీఐలు సిబ్బందితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి సద్భావనసర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఎంఎఫ్ రోడ్, వాసవీ ధర్మశాల, రహమత్‌పురం సర్కిల్, రైల్వేరోడ్డు, బాలాజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు సున్నిత ప్రాంతాల్లో కవాతు చేపట్టామన్నారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, స్పెషల్‌పార్టీ పోలీసుల కవాతు

క్రమం తప్పకుండా టీకాలు వేయండి

హిందూపురం టౌన్: చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని పీపీ యూనిట్ వైద్యాధికారిణి జయం పద్మజ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని అంగన్‌వాడీ, లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ మాసూచి, కలరా, పోలియో లాంటి వాటిని టీకాల ద్వారానే అరికట్టామన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి చిన్నారుల ఆరోగ్యం గురించి అంగన్‌వాడీ కార్యకర్తతో తెలుసుకున్నారు. మండలంలో డాక్టర్ ఆనంద్ బాబు పరిశీలించారు. డాక్టర్ మంజుశ్రీ పాల్గొన్నారు.

నేడు గాలి జనార్దనరెడ్డి రాక

పావగడ: కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి ఆదివారం పావగడకు రానున్నారని ఆ పార్టీ నాయకుడు నేరళకుంటి నాగేంద్ర తెలిపారు. గురు భవన్ మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో గాలి జనార్దనరెడ్డి ప్రసంగిస్తారన్నారు. ఎస్‌ఎస్‌కే బయలు రంగ మందిరంలో నిర్వహించే సమావేశంలో పాల్గొన్న అనంతరం కేఆర్‌పీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు జయ శంకర్ రెడ్డి, సత్య నారాయణ రెడ్డి, ఎస్ హనుమంతరాయప్ప, అంజినరెడ్డి సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోండి

అమరాపురం: మండల పరిధిలోని ఎస్.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు అంజినాయక్‌ను కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్, లీగల్ అడ్వైజర్ ఎస్పీ బాబు, ప్రధాన కార్యదర్శి భూక్యకాలే నాయక్ తదితరులు ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీన పేరెంట్స్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడి సీల్ ఇవ్వాలంటూ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంజుల భర్త ముద్దన్న, కిష్టప్ప, చిత్తన్న బెదిరించినట్లు ఉపాధ్యాయుడు అంజినాయక్ తెలిపారు. అలాగే ముద్దన్న తప్పతాగి వచ్చి విచక్షణ రహితంగా కొట్టాడని వివరించారు. కులం పేరుతో సుగాలి తన గొంతు పట్టుకుని కొట్టాడన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాలేనాయక్, గిరిధర్‌నాయక్, పవన్ నాయక్, రాజేష్ నాయక్, బాలకృష్ణనాయక్, మహిళా అధ్యక్షురాలు హేమలత పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మడకశిర: గుడిబండ మండలంలోని హిరేతుర్పిలో శనివారం ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు శ్రీరామతారక హోమం, సీతారామ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు హారతి ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, తిమ్మప్పస్వామి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి వివిధ పూజలు చేశారు. ఆదివారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు తెలిపారు.

మోడల్ కళాశాలలో సరస్వతీ పూజ

మడకశిర(అగళి): అగళి మోడల్ కళాశాల, పాఠశాల విద్యార్థులు శనివారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో సరస్వతీ చిత్రపటాన్ని కొలువుదీర్చి, పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ, ఆపరేటర్ సర్వీసెస్, టెక్నీషియన్ కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది, ఆపై తరగతులు చదివిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 7989479371 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మడకశిర: మండలంలోని సీకొడిగేపల్లి వద్ద శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల దత్తత గ్రామమైన బుళ్లసముద్రం గ్రామంలో ఉద్యాన రైతు పోలాల్లో శనివారం వైస్ చాన్స్‌లర్ టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ముద్దబంతి, కనకాంబరం, ఆకుకూరల తదితర ఉద్యాన పంటలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యానపంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్ పాల్గొన్నారు.

మహిళపై కోతుల దాడి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో శనివారం సాయంత్రం కోతులు జనంపై దాడికి దిగాయి. దాదాపు పది కోతులు చుట్టుముట్టి సునీత బాయి అనే మహిళను గాయపరిచాయి. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్సనిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అగ్ని మాపక పరికరాల పంపిణీ

పరిగి: మండలంలో మొదటి విడత నాడు-నేడు పథకానికి ఎంపికైన పాఠశాలలకు అగ్ని మాపక పరికరాలను ఎంఈఓ లక్ష్మీదేవి పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 21 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్స్‌ను స్థానిక ఎమ్మార్సీలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున ప్రచారం

గోరంట్ల: త్వరలో జరగబోవు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కోరారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు శివారెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రఘునాథరెడ్డి, ధర్మారెడ్డి, ఇంద్రప్రసాద్, గంగాధర్ రెడ్డి, అంజినాయక్, పీఆర్‌టీయూ నాయకులు దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస శివారెడ్డి కోరారు. శనివారం పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాముద్దీన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఆయన సోదరుడు హరినాథరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. వైస్‌చైర్మన్ సునీల్, నాయకులు, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సద్దాం, తయూబ్, భాస్కర్‌నాయక్, గణేష్, శ్రీరాములు, వెంకటరామిరెడ్డి, మారుతి, వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

సోమందేపల్లి: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కోరారు. శనివారం సాయంత్రం పాఠశాల విధులు ముగిసిన అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు కిష్టప్ప, కార్యదర్శి శ్రీనివాసులు, హెచ్ఎంలు ఖాదర్‌వలి రజనీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరివర్తనతో జీవితాన్ని కొనసాగించండి

హిందూపురం: క్షణికావేశంతో తప్పులు చేసి జైలుకు వచ్చి శిక్ష అనుభవించిన ముద్దాయిలు పరివర్తన చెంది సమాజంలో శాంతియుత జీవనాన్ని కొనసాగించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక సబ్ జైలును న్యాయమూర్తి శనివారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలు, ఏఏ కేసుల్లో ఎంతకాలంగా ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో ఖైదీలకు అమలు చేస్తున్న విధి విధానాలు, మెనూ గురించి జైలర్ చంద్రశేఖర్ వివరించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ చేసిన తప్పులు తిరిగి చేయకుండా మార్పు పొందాలన్నారు. చాలాకాలంగా శిక్ష అనుభవిస్తూ బెయిల్ కోసం న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని వారు కోర్టుకు అర్జీ పెట్టుకుంటే ప్రభుత్వమే న్యాయవాదిని నియమించి బెయిల్‌కు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, రకీబ్, లోక్ అదాలత్ సభ్యురాలు హేమావతి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయ సేవలు అందాలి

పావగడ: సమాజంలో అన్ని వర్గాల వారికి సమానంగా న్యాయ సేవలు అందాలని, అప్పుడే అసమానతలు తొలగిపోయి సమ సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని స్థానిక జేఎంఎఫ్‌కసీ ప్రధాన సివిల్ న్యాయమూర్తి శ్రీకాంత్ రవీంద్ర తెలిపారు. స్థానిక కామధేను నైపుణ్యత శిక్షణ శిబిరంలో శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం అందరికీ అందాలన్నారు. నిరక్షరాస్యత, పేదరికం శాపంగా మారాయని, వాటి నుంచి బయటపడే ప్రయత్నాలు చేయాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి హరిణి మాట్లాడుతూ.. న్యాయ సమస్యలు ఉన్న వారికి చట్టంపై అవగాహన కల్పించడానికి వీలుగా కళాశాలలు, పాఠశాలలు, సంఘ సంస్థల పదాధికారులకు చట్టం న్యాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి విస్మిత మూర్తి, ఏపీపీ మంజునాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, శ్రీధర్ గుప్త, సత్య లోకేశ్, సుశీలమ్మ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్లండి

హిందూపురం: భారత రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్లాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్పందన విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పాంచజన్య పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. అభిరుచి అనుగుణంగా ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పినట్లు సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. కేవలం హక్కుల కోసమే కాకుండా బాధ్యతలను గుర్తుంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని చెప్పారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్

ప్రభుత్వ వ్యవస్థల పనితీరు ఉట్టిపడేలా విద్యార్థులు తయారుచేసిన ప్రయోగ నమూనా ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి స్పందన పేర్కొన్నారు. స్థానిక పంచజన్యస్కూల్ అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సైన్సుఫేర్‌ను జడ్జి ప్రారంభించారు. స్కూల్ సెక్రటరీ నందకుమార్, ఏడీ స్మిత, నందిత,హెచ్ఎం గాయిత్రీ, ఏఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి స్పందన

నేడు వైద్యశిబిరం


పరిగి: కొడిగెనహళ్లి ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో కేన్సర్, గ్యాస్ట్రిక్ సంబంధించిన సమస్యలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మిల్లు హెచ్ఆర్ హెడ్ జగపతిరాజు తెలిపారు. పరిగి పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో హిందూపురంలోని ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతో మిల్లు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహించనున్నారు. వివరాలకు సెల్ నంబర్ 83093 73272లో సంప్రదించాలన్నారు.

బీజేపీని గెలిపించండి

పావగడ: వచ్చే స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని స్థానిక సీనియర్ హైకోర్టు న్యాయవాది, బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహుడు లాయర్ కృష్ణానాయక్ ప్రజలకు సూచించారు. శనివారం తాలూకాలోని కే రాంపురం, నాగలాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. విజయ సంకల్ప అభియానలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, కోటీశ్వరరెడ్డి, రాజేంద్ర, నాగిరెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. శనివారం శంకరగల్లు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠాన్ని చదివించారు. విద్యార్థులు బాగా చదవడంతో ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



శంకరగల్లు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

సంక్షిప్త సమాచారం

ముగిసిన సిద్ధేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

అమరాపురం: హేమావతిలో సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శయనోత్సవం సందర్భంగా స్వామికి ప్రాతఃకాల పూజలైన సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంకాలం అర్చకులు భక్తులు రంగుల నీళ్లతో పండుగను చేసుకున్నారు. ఒకరిపై ఒకరు రంగు నీటిని చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

కాలిపోయిన అటవీప్రాంతం

పెనుకొండ రూరల్: పెనుకొండ చుట్టు పక్కల ప్రాంతాల్లో అడవులు అగ్నికి ఆహుతుతున్నాయి. అయితే అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. శనివారం మధ్యాహ్నం కుంభకర్ణ ప్రాజెక్టు సమీపంలోని అనంతపురం రహదారి పక్కనున్న కొండ ప్రాంతానికి నిప్పు పెట్టడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

గుడిబండ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని గుడిబండ వైద్య అధికారి డాక్టర్ సౌందర్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని నాచేపల్లిలో వైద్య సిబ్బంది పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

నేడు బలిజ వివాహ పరిచయ వేదిక

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం బలిజ కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక అధ్యక్షుడు జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులు, వారి తల్లిదండ్రులు ఆరోజు ఉదయం తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం వధూవరుల పరిచయ కార్యక్రమం, కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి బయోడేటాతో పాటు కార్డు సైజ్ ఫొటోతో హాజరుకావాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

మడకశిర(అగళి): అగళి మండల నూతన ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మహేంద్ర, మండల నాయకులు చంద్రప్ప, కామరాజు, నటరాజు, సురేష్, సతీష్, శివకుమార్, వెంకటస్వామి, రామకృష్ణప్ప, కిష్టప్ప, లింగరాజు, గోవిందప్ప, గంటా నాగరాజు, శ్రీనివాస్, శివన్న, రంగనాథ్, రమేష్, మంజునాథ్, రంగప్ప పాల్గొన్నారు.

పశువుల మందుల సరఫరా

పెనుకొండ: పట్టణంలోని పశువైద్య ఆరోగ్య కేంద్రంలో డివిజన్‌లోని పలు మండలాలకు పశువుల మందులు సరఫరా చేశారు. ఇటీవల పాడి రైతులకు కావాల్సిన మందుల కోసం పశువైద్యులు డివిజన్ కార్యాలయానికి నివేదిక అందించారు. ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పూర్తి నివేదిక పంపగా పశువుల మందులు సరఫరా అయ్యాయి. మందులను డీడీ పెంచలయ్య ఆయా పశువైద్యశాలలకు వాహనాల్లో పంపించారు.

ఎగ్జిబిషన్‌లో ఏపీఆర్ఎస్ఈ విద్యార్థి ప్రతిభ

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ఈ విద్యార్థి మాస్టర్ అశోక్ కర్ణాటక రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచాడు. ఏపీఆర్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న అశోక్ ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని, ప్రతిభ కనబరిచాడు. ఏపీఆర్ఎస్ పూర్వ విద్యార్థి, ఐఆర్ఎస్ (ఐఎస్ఆర్ఓ) గ్రూపు డైరెక్టర్ ప్రొఫెసర్ హరినాథ్‌శర్మ సహకారంతో కర్ణాటక రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే అవకాశం మాస్టర్ అశోక్‌కు కల్పించారు. కర్ణాటక రాష్ట్రం గౌరిబిదనూరులోని హెచ్ఎన్ కళాభవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగమోహన్ గైడ్‌లైన్స్‌తో రూపొందిన విశ్వమానవ హితానికి విశ్వ విజ్ఞానం అనే ఇతివృత్తంతో నిర్వహించిన పోస్టర్‌ను ప్రజెంటేషన్ చేపట్టాడు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ, పద్మవిభూషన్ అవార్డుల గ్రహీత, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ బీఎన్ సురేష్ హాజరై విద్యార్థి అశోక్‌ను అభినందించారు. శనివారం సాయంత్రం ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అభినందించారు.